వెళ్ళినపుడు ఆమె ఇంటికి కూడా వెళ్ళాను. ఉద్యోగమొచ్చిందని చెప్తే సంతోషించింది. మరి నీ సంగతేమిటన్నాను. "మా బాబాయ్ పెళ్ళి చేస్తానంటున్నాడు. నేనొద్దంటున్నాను" అంది.

అంతే. మళ్ళీ రెండేళ్ళ క్రితం ఇక్కడికొచ్చినప్పుడే భానుమతిని చూడ్డం. అయితే అప్పుడప్పుడూ ఉత్తరాలు రాసేది. ఆమె రాసిన వాటికంటే వాళ్ళూ వీళ్ళూ చెప్పగా విన్న కథలెక్కువున్నాయి. నేనొచ్చిన రెండేళ్ళ తర్వాత బి.ఏ. పూర్తి చేసింది. వాళ్ల బాబాయి ఎంత ప్రయత్నించినా ఆమెను పెళ్ళాడ్డానికెవరూ ముందుకు రాలేదు. వచ్చినవాళ్ళని, పెళ్ళిచూపుల్లో నానా ప్రశ్నలూ అడిగి హడలు కొట్టింది. వాళ్ళ బాబాయికి విసుగెత్తి, కోపమొచ్చి పెళ్ళి ప్రయత్నాలే మానేశాడు. ఇదంతా ఆమే రాసింది.

"పెళ్లంటే నాకిష్టం లేక కాదు. నా శరీరం మీద, నా అందం మీద చూపిన మోజు నా మనసు మీద, నా అభిప్రాయాల మీదా ఎవడూ చూపడం లేదు. అలాంటివాళ్ళు నాకక్కర్లేదు. నా సంగతి నీకు బాగా తెలుసు గనక నీ దృష్టిలో నాకు తగ్గ వాడెవడన్నా వుంటే చూడు" అని రాసిందొక ఉత్తరంలో. అలాగేనని సమాధానమైతే రాశాను గాని, ఆమెకి తగిన వరుణ్ణి వెదకడమండే మాటలా ! నావల్ల కాలేదు. తర్వాత కొన్నాళ్ళకి ఆమెకు విశాఖపట్నంలో ఉద్యోగమొచ్చి వెళ్ళిపోయింది. ఇప్పుడూ అక్కడే వుంటోంది. ఇంకా పెళ్ళి కాలేదు.

మా క్లాస్‌మేటొకడు రామారావని వాడూ విశాఖపట్నంలోనే వుంటున్నాడు. వాడీమధ్య ఇక్కడికొచ్చి నాతో, నేను నమ్మలేని వార్తొకటి చెప్పాడు.

"భానుమతి పూర్తిగా చెడిపోయింది. అడ్డమైన వాళ్ళతోనూ తిరుగుతోంది. పెళ్ళి పెటాకులు లేవు. అడిగేవాళ్ళు లేరు. ఒంటరిగానే వుంటోంది. మరీ హద్దు మీరిపోయింది' ' అన్నాడు.

ఇది నేను నమ్మలేని వార్త. భానుమతి చాలామంది మగాళ్ళని ఏడిపించింది. ఆడించింది. అంతే. అంతకుమించి మరేం లేదు. అందాకా ఎందుకు ? నాతో అంత చనువుగా సన్నిహితంగా ఉండేదా, ఎన్నడూ ఒక్క అనరాని మాట అనలేదు, చెయ్యరాని పని చెయ్యలేదు. అందుకే భానుమతంటే నాకు గౌరవం, అభిమానం. అలాంటిది ఇట్లా మారిందంటే నమ్మలేను.

* * *

మా బాస్‌కి నామీద ప్రేమ ఎక్కువైనప్పుడల్లా టూర్ మీద పంపుతాడు. ఈసారి విశాఖపట్నం వెళ్ళి రమ్మన్నాడు. మరోచోటికైతే వద్దనే వాణ్ణేమోగా అని విశాఖపట్నం అనగానే ఎగిరి గంతేశాను. భానుమతిని చూడొచ్చు

* * *

నాపని పూర్తవగానే భానుమతి పనిచేసే ఆఫీసు కెళ్ళాను. నన్ను చూసి చాలా

